


రంజాన్ వేళలు
ఇఫ్తార్: శనివారం సా: 6.36 గం.
సహర్: ఆదివారం ఉ: 4.43 గం.





భక్తిశ్రద్ధలతో జుమాతుల్ విదా

రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం (జుమాతుల్ విదా) సందర్భంగా మెదక్ జిల్లా కేంద్రంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

-మెదక్ కల్చరల్

ముస్లింలకు జగ్గారెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 5 : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సాయంత్రం సంగారెడ్డిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. విందు సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింల భక్తి శ్రద్ధలకు ప్రతీక రంజాన్ పవిత్రమాసమని జగ్గారెడ్డి అన్నారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మైనారిటీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నిటినీ అమలు పరచి తీరతామన్నారు. ఈ విందులో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీకి ఖర్జూర పండు తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, పక్కన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

పట్టా సర్వే నంబర్లు వేసి ప్రభుత్వ భూమి కబ్జా

- అమీన్‌పూర్ సర్వే నంబర్ 343లో ప్రభుత్వ భూమి మాయం
- లేఅవుట్‌లో ప్లాట్లు కొని ఇళ్లు కట్టుకున్న తరువాత వెలుగులోకి..
- నోటీసులు రావడంతో లబోదిబోమంటున్న బాధితులు
- మోహం చాటేస్తున్న రియల్టర్లు
- న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్న బాధితులు



అమీన్‌పూర్ 343 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇళ్లు

పటాన్‌చెరు, ఏప్రిల్ 5 : ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి ఇళ్లు కట్టి అమ్మేసుకున్నారు. పదేళ్ల క్రితం జరిగిన ఈ కబ్జా పర్వంపై అధికారులు చర్యలకు ఉపక్రమించడంతో ఆ ఇళ్లను కొనుగోలు చేసి వారు లబోదిబోమంటున్నారు. పట్టా భూమికి చెందిన సర్వే నంబర్లు వేసి పక్కనే ఉన్న కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని స్వాహా చేసిన ఉదంతం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో వెలుగులోకి వచ్చింది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బందంకొమ్ము ప్రాంతంలో కృష్ణ బృందావన్ కాలనీ పేరిట ఏడేళ్ల క్రితం వేసిన లేఅవుట్‌లో జరిగిన అక్రమాలపై జిల్లా అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ భూమి ఉన్న 343 సర్వే నంబర్‌ను ఆనుకుని ఉన్న 345, 346, 347, 348, 349, 350, 351, 357, 358, 359, 360 తదితర సర్వే నంబర్లలో 12 ఎకరాల విస్తీర్ణంలో అప్పట్లో రియల్టర్లు లేఅవుట్ చేశారు. ఇందుకు హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఈ లేఅవుట్‌లో పక్కనే ఉన్న 343 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూములను కలిపేసుకున్నారు. అప్పటి ప్రభుత్వంలోని జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలతో నాలుగు నుంచి ఐదెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి లేఅవుట్‌లో కలుపుకున్నారు. ఈ భూమికి తమ పట్టా నంబర్లు వేశారు. ఎల్ఆర్ఎస్ నిబంధనలకు విరుద్ధంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మధ్యతరగతి వేతన జీవులు బ్యాంకుల్లో లోన్లు తీసుకుని ఇళ్లను కొనుగోలు చేశారు. మున్సిపాలిటీ అనుమతులను చూసి బ్యాంకులూ కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేశాయి.

గత అక్రమాలపై నజర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగి సదరు లేఅవుట్‌ను సర్వే చేశారు. పెద్దఎత్తున ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తేలడంతో చర్యలకు ఉపక్రమించారు. సుమారు వంద ఇళ్లకు పైగా ప్రభుత్వ సర్వే నంబర్ 343లోకి వస్తున్నాయని తేలింది.

అయితే, ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమాయకులకు అంటగట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పత్తా లేకుండా పోయారు. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నేత ఒకరు ఇప్పుడు తనకేమీ తెలియనట్టు నటిస్తున్నారు. అమాయకులు మాత్రం తాము తీవ్రంగా నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

100 ఇళ్ల కూల్చివేతకు నోటీసులు జారీ

కృష్ణ బృందావన్ కాలనీలో సుమారు 100 ఇళ్లు ప్రభుత్వ సర్వే నంబర్ 343 పరిధిలోకి వస్తాయని తేలడంతో రెవెన్యూ యంత్రాంగం కూల్చివేతలకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వ స్థలంలో ఉన్న ఇళ్లు, స్థలాలను మార్కింగ్ చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా గుర్తించిన ఇళ్లకు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

మున్సిపల్ అనుమతులు చూసి రిజిస్టర్ డాక్యుమెంట్ ద్వారా ఇళ్లను కొనుగోలు చేశామని, నిజంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తే అనుమతులు ఎలా ఇస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఆదేశాలు

ఈ వ్యవహారంపై సంగారెడ్డి ఆర్డీవో సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించి లేఅవుట్ తయారుచేసిన బిల్డర్లపై చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 343 సర్వే నంబర్‌లో నిర్మించిన ఇళ్లు, ప్లాట్లను గుర్తించి ఎలాంటి క్రయవిక్రయాలు జరగకుండా సంగారెడ్డి రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఈ లేఅవుట్‌లో ఇళ్లు కొనుగోలు చేసి నష్టపోయిన బాధితులు సొసైటీగా ఏర్పడి న్యాయం కోసం అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తున్నారు. దీనిపై త్వరలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బాధితులు పేర్కొంటున్నారు. లేఅవుట్ చేసి ఇళ్లు నిర్మించిన ఇన్నేళ్ల అనంతరం ప్రభుత్వ భూమి అంటూ వేధించడం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణకు గురైందని చెబుతున్న 343 సర్వేనంబర్ మొత్తాన్ని మరోసారి సర్వే చేసి చెరువులు, కుంటలు, గుట్టలు, ఎస్పీఎఫ్ అకాడమీకి ఇచ్చిన భూములు, అసైన్డ్ భూముల లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. సమగ్రంగా సర్వే చేస్తే కొందరికైనా న్యాయం జరుగుతుందని కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇళ్లు, ప్లాట్లు నిర్మించి అమాయకులకు అంటగట్టిన రియల్టర్లు, అందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేస్తున్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించడంలో

కాంగ్రెస్ విఫలం

- ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ఓట్లడిగే హక్కు లేదు
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.లక్ష్మణ్



సంగారెడ్డి రైతు సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో రైతుల సమస్యలను పరిష్కరించడంలో.. వారికిచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్ ఆరోపించారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఇప్పటికీ అమలు చేయని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే హక్కు లేదని అన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారని ప్రశ్నించారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేల సాయం, వడ్ల క్వింటాలుకు రూ.500 బోనస్, పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. రైతులు కరువుతో సతమతమవుతున్నా రుణాలు చెల్లించాలని బ్యాంకులు ఒత్తిడి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నాయకులు రవీందర్, రమేశ్, చంద్రశేఖర్, జగన్, గురువారెడ్డి, మాణిక్‌రావు, రాజశేఖర్, అనంతరావు కులకర్ణి, వెంకట నర్సింహారెడ్డి, రాజుగౌడ్, పోచారం రాములు, వాసు, అశ్వంత్, ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

రహదారి.. దోపిడీలు..!

- అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం
- కనిపించని హైవే పెట్రోలింగ్

పుల్కల్ మండలం చక్రియాల్ గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, భార్య విజయతో కలిసి మార్చి 19న మధ్యాహ్నం సంగారెడ్డి నుంచి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. జాతీయ రహదారి 161పై ఫసల్‌వాది గ్రామ శివారులోకి రాగానే రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు వారిని అడ్డగించారు. పోలీసులమని చెప్పి బైక్‌ను ఆపారు. ఆ తరువాత కత్తితో బెదిరించి వారి వద్ద ఉన్న ఆభరణాలను దోచుకెళ్లారు.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు మొయినొద్దీన్, ఇసాక్, కైఫ్ ఈ నెల 2వ తేదీన కంది శివారులో 65వ నంబరు జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాలో స్నేహితులతో కలిసి భోజనం చేశారు. అనంతరం రుద్రారం వెళ్లేందుకు ముగ్గురు కలిసి ఆటో ఎక్కారు. కొద్ది దూరం వెళ్లిన అనంతరం డ్రైవర్, ఆటో కూర్చున్న మరొకరు ఇసాక్ మెడకు కత్తి పెట్టి డబ్బులు, సెల్‌ఫోన్‌లు తీసుకున్నారు. అనంతరం మోయినొద్దీన్‌ను, కైఫ్‌ను ఆటోలో నుంచి బయటకు తోసేశారు. ఆటో నెమ్మదించడంతో ఇసాక్ బయటకు దూకేశాడు. తీవ్రంగా గాయపడిన మోయినొద్దీన్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన కైఫ్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనలో నిందితులు 5వ తేదీన పోలీసులకు పట్టుబడ్డారు.

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 5 : సంగారెడ్డి జిల్లా పరిధిలోని జాతీయ రహదారులపై ప్రయాణికులకు భద్రత కరువయింది. జిల్లాలో నాందేడ్-అకోలా 161వ జాతీయ రహదారి, హైదరాబాద్-ముంబై 65వ నంబరు జాతీయ రహదారులు ఉన్నాయి. ఈ హైవేలపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. అయినా, ఒకరిద్దరు బైక్‌లపై వెళ్లేందుకు జంకుతున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులతో కలిసి బైక్‌లపై వెళ్లాలంటే ఆలోచించాల్సి వస్తున్నది. జాతీయ రహదారులపై పోలీసులు నిత్యం హైవే పెట్రోలింగ్ చేయాల్సి ఉంటుంది. జాతీయ రహదారులపై అనుమానాస్పదంగా వెళ్తున్న, కారణం లేకుండా నిలిపిన వాహనాలు.. వ్యక్తులపై నిఘా వేసి విచారించాల్సి ఉంటుంది. కానీ, జిల్లా పరిధిలో హైవే 161పై కానీ.. హైవే 65పై కానీ పోలీసు పెట్రోలింగ్ కనిపించడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అలాగే, జాతీయ రహదారులపై సీసీకెమెరాలతో నిఘా పెడుతున్నామని పోలీసులు చెబుతున్నా.. అది మూణ్నాళ్ల ముచ్చటే అవుతున్నది. ఏదైనా ఘటన జరిగినప్పుడు సమీప గ్రామాల ప్రజలకు సీసీకెమెరాలు పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. వారు ముందుకువచ్చి కెమెరాలు ఏర్పాటు చేసుకున్నా వాటి నిర్వహణ తలకుమించిన భారంగా మారడంతో కొన్నాళ్లకు మూలకు చేరుతున్నాయి. దీంతో, దోపిడీలు జరిగినప్పుడు నిందితులను పట్టుకునే అవకాశాలు తగ్గిపోతున్నాయి.

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్

ఆటోలో నుంచి నెట్టేసి ఒకరి మృతికి కారణమైన నిందితులు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 5 : కంది మండలం మామిడిపల్లి వద్ద ఈ నెల 2న ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురిపై దాడి చేసి దోచుకుని, ఒకరి మృతికి కారణమైన నిందితులను సంగారెడ్డి రూరల్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 2న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మొయినొద్దీన్ (31), మహ్మద్ ఇసాక్, మహ్మద్ కైఫ్, సైఫ్‌ఖాన్, అర్జున్‌గౌతం కలిసి రుద్రారం నుంచి బొలేరో పికప్‌వ్యాన్‌లో సిమెంట్ పలకల లోడ్‌ను తీసుకుని వెళ్లి చిమ్నాపూర్‌లో ఖాళీ చేశారు. అక్కడి నుంచి మల్లేపల్లికి వెళ్లి, సాయంత్రం కంది శివారులో జమ్‌జమ్ దాబా వద్ద భోజనం చేశారు. అనంతరం, రాత్రి 9 గంటలకు సైఫ్‌ఖాన్, అర్జున్‌గౌతమ్ బైక్‌పై వెళ్లగా.. మొయినొద్దీన్, ఇసాక్, కైఫ్ ఆటోలో బయలుదేరారు. మామిడిపల్లి వద్ద నిర్మానుష్య ప్రాంతంలోకి రాగానే డ్రైవర్, ఆటోలో ఉన్న మరో వ్యక్తి.. కత్తులు చూపించి వారి వద్ద నుంచి డబ్బులు, సెల్‌ఫోన్లు తీసుకున్నారు. అనంతరం మొనుద్దీన్, కైఫ్‌ను ఆటోలో నుంచి రోడ్డు మీదకు నెట్టేశారు. ఆటో నెమ్మదించడంతో ఇసాక్ బయటకు దూకేశాడు. రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డ మొయినొద్దీన్ మృతి చెందగా, కైఫ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నేపథ్యంలో శుక్రవారం మామిడిపల్లి చౌరస్తాలో సంగారెడ్డి రూరల్ సీఐ అశోక్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను ఆపారు. హైదరాబాద్‌లోని సీతారాంపేటకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఇస్మాయిల్ అలియాస్ అర్బస్ అలియాస్ పటేల్ (22), కార్వాన్ ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ ముదాసీర్ (20)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు ఆటో ప్రయాణికులను దోచుకుని రోడ్డు మీదకు నెట్టేసింది తామేనని అంగీకరించారు. అదే రోజు రుద్రారం-ఇస్నాపూర్ మధ్యలో మరో వ్యక్తిని బెదిరించి రూ.15వేలు లాక్కున్నట్టు నిందితులు తెలిపారు. నిందితుల నుంచి రూ.4,400 నగదు, రెండు కత్తులు, ఒక సెల్‌ఫోన్, బాధితులకు చెందిన రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.



సంగారెడ్డిలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ క్రాంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మహనీయులను మరవొద్దు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 5 : మహనీయులను మరవొద్దని, వారి ఆశయసాధనకు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహనీయుల అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి అఖిలేష్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ మాధవరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ అధికారి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నతమైన భవిష్యత్తు..

భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఎస్సీ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలను ఆయన ప్రారంభించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చదువుతోనే ఉన్నతమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, వివిధశాఖల అధికారులు నరసింహారావు, రాజిరెడ్డి, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటేసేందుకు 12 రకాల గుర్తింపు కార్డులు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 5: ఓటుహక్కును వినియోగించుకోవడానికి ఓటరు గుర్తింపుకార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల గుర్తింపు కార్డులను చూపించవచ్చని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్‌లోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన గుర్తింపుకార్డుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేరుంటే ఓటరుకార్డు లేకపోయినా ప్రత్యామ్నాయ గుర్తింపుకార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటేయవచ్చని చెప్పారు. ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకులు, తపాలాశాఖ జారీచేసిన ఫొటోతో ఉన్న పాస్‌పుస్తకాలు, కార్మికశాఖ జారీచేసిన హెల్త్‌స్మార్ట్ కార్డు, డ్రైవింగ్‌లైసెన్స్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వరంగ సంస్థలు జారీచేసిన గుర్తింపుకార్డులు, దివ్యాంగుల గుర్తింపుకార్డు చూపించవచ్చని పేర్కొన్నారు.

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఫోరెన్సిక్ టీం విచారణ

పేలుడు జరిగిన ప్రదేశంలో నమూనాల సేకరణ

హత్నూర, ఏప్రిల్ 5: సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమను శుక్రవారం ఫోరెన్సిక్ టీం సందర్శించింది. రెండ్రోజుల క్రితం పేలుడు జరిగిన ప్రదేశాన్ని ఫోరెన్సిక్ టీం అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్‌రాజ్ నేతృత్వంలోని బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఘటనా స్థలంలో రసాయనాల నమూనాలు, రియాక్టర్ శకలాలను సేకరించింది. వాటన్నింటినీ విశ్లేషించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని బృందంలోని సభ్యులు తెలిపారు. జిన్నారం సీఐ అరుణ్‌కుమార్, ఎస్ఐ సుభాష్ ఉన్నారు.

వైద్యం అందక ఇబ్బందులు

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కార్మికులు సరైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియాక్టర్ పేలిన ఘటనలో గాయపడిన బోయిని భిక్షపతి, అశోక్‌సింగ్, మహదేవ్, మదన్‌రావు ఎంఎస్ఆర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఇక్కడ తమకు సరైన వైద్యసేవలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగతా కార్మికులు సొంత ఖర్చులతో సంగారెడ్డిలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పరిశ్రమ యాజమాన్యం గాయపడినవారి గురించి పట్టించుకోవడం లేదని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



పరిశ్రమలో నమూనాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ టీం

'ఉపాధి' సరే.. కూలి ఎప్పుడిస్తరు!

● రెండు నెలలుగా అందని కూలి ● ఆందోళనలో ఉపాధి కూలీలు



అల్లాదుర్గం, ఏప్రిల్ 5 : మండుటెండను సైతం లెక్క చేయకుండా ఉపాధి పనికి వెళ్తున్న కూలీలకు రెండు నెలలుగా కూలి డబ్బు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ ఒక్కరికి పని కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామి పథకాన్ని ప్రవేశపెట్టింది. అల్లాదుర్గం మండలంలో సుమారు 7,390 రైతు కూలీలకు జాబ్‌కార్డులు అందించారు. కూలీలు ప్రతీ రోజు సుమారు 3,500 మంది వరకు ఈ పథకం కింద ఉపాధి పనులు చేస్తున్నారు. కూలీలకు మాత్రం ప్రభుత్వం గత ఫిబ్రవరి మాసం నుంచి కూలి డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి రాకపోతే తమ జీవనం ఎలా గడుస్తుందంటూ వారు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. కాయిదంపల్లి గ్రామంలో 250 పైబడి కూలీలు ఉపాధి పొందుతున్నారు. వీరికి పనులు ప్రారంభించినప్పటి నుంచి (12 వారాలుగా) కూలి డబ్బులు రాకపోవడంతో వారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారులకు ప్రతీ నెల వేతనాలు ఇస్తున్నా, తమ పట్ల ఎందుకు చిన్న చూపు అని మండిపడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు తక్షణమే కూలి డబ్బులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

ఏం తిని బతకాలి



పొట్టకూటి కోసం మండుటెండలో పనులు చేస్తున్న మాకు రెండు నెలలుగా కూలి డబ్బులు రాలేదు. మా కుటుంబం ఏం తిని బతకాలి. కూలి డబ్బులు ఇంకెప్పుడు వస్తాయని అధికారులను ప్రశ్నిస్తే నేడు, రేపు అంటు కాలం గడుపుతున్నారు. 11 వారాలుగా ఇవ్వడం లేదు.

- నాగారపు వీణ, కాయిదంపల్లి

కూలి డబ్బు రాకుంటే వలసలే గతి



మా గ్రామంలోనే ఉపాధి దొరుకుతుందని భావించి ఉపాధి పనులకు వెళ్తే సకాలంలో కూలి డబ్బులు రావడం లేదు. పొట్టకూటి కోసం అప్పు చేయాల్సి వస్తుంది. దీంతో జీవనోపాధి కోసం పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లక తప్పదు. రెండు నెలలు కూలి డబ్బును వెంటనే ఇప్పించాలి.

- తిమ్మపురం నరేష్, కాయిదంపల్లి

గంజాయి కింగ్‌పిన్ నీతూబాయి అరెస్టు

● విచారణ చేస్తున్న గౌరారం పోలీసులు



నీతూబాయిని విచారిస్తున్న సీఐ, ఎస్ఐ

వర్గల్, ఏప్రిల్ 5 : గంజాయి సరఫరా, విక్రయాల్లో ఆరితేరిన కింగ్‌పిన్ నీతూబాయిని శుక్రవారం గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. సంఘటనకు సంబంధించి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో నివాసముంటున్న గంజాయి సరఫరా చేసే నిందితురాలు నీతూబాయిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఎక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చేది, ఎవరెవరికీ అమ్మేవారు, ఎవరెవరితో డిజిటల్ లావాదేవీలు జరిపారని ప్రశ్నించారు. పదేళ్ల నుంచి గంజాయిని విక్రయిస్తుండగా, ఇటీవల తనతో పాటు తన కుటుంబసభ్యులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు, గోల్కొండ పోలీసులు, గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేశారు. తనతో పాటు తన కుటుంబ సభ్యులపై 18 కేసులు నమోదు చేశారు. నీతూబాయిపై హైదరాబాద్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి సుమారు సంవత్సరం పాటు జైలులో ఉంచారు. తన ఆస్తులను అటాచ్ చేసినా, గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వర్గల్ మండలంలోని పలు గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులను విచారిస్తామని సీఐ తెలిపారు. గ్రామాల్లో గంజాయి విక్రయించిన, వారి వద్ద ఉన్న సిగరేట్‌లలో కలిపి తాగిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని సీఐ, ఎస్ఐ హెచ్చరించారు.

కాంగ్రెస్ అంటేనే మోసం

● రైతులకు ఇచ్చిన హామీ అమలుపై మాట తప్పిన సీఎం
● మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఏప్రిల్ 5: కాంగ్రెస్ అంటేనే మోసమని, ప్రజలను మభ్యపెట్టడంలో ఆ పార్టీ ముందు ఉంటుందని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మండిపడ్డారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రైతు సత్యాగ్రహ దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టం జరిగిందని, ఎకరాలకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లిసామన్న కాంగ్రెస్ ఎందుకు మాట తప్పుతుందో ప్రజలకు చెప్పాలన్నారు. వరికి ఎకరానికి రూ.500 బోనస్ ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. ఆ పార్టీకి నోట్లు, ఓట్లు, సీట్లు, అధికార యావ తప్ప అన్నదాతలకు ఏం చేయాలనే విషయంపై స్పష్టత లేదన్నారు. రాహుల్‌గాంధీని తీసుకొచ్చి సభ పెడితే తుక్కు తుక్కుగా తొక్కి ఢిల్లీకి పంపుతామన్నారు. వెంకట్రామారెడ్డి కేసీఆర్ కాలు మొక్కి ఎమ్మెల్సీ అయ్యాడన్నారు. పైసలు ఉన్నాయని ఎంపీ సీట్ ఇచ్చారని ఆరోపించారు. అంతకు ముందు ఉదయం పట్టణంలోని స్టేడియం, జూనియర్ కళాశాల, వెస్లీ మైదానంలో వాకర్స్, క్రీడాకారులతో రఘుందన్‌రావు కలిసి వాకింగ్ చేశారు.

కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కులేదు

- మోటార్లు కాలిపోతున్నాయి.. పొలాలు ఎండిపోతున్నాయి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

పాపన్నపేట/చిన్నశంకరంపేట/మెదక్/గజ్వేల్, ఏప్రిల్ 5 : ఎన్నికల్లో 420 హామీలంటూ మాయమాటలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లడిగే నైతిక హక్కులేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో, చిన్నశంకరంపేటలో, మెదక్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ వరి ధాన్యానికి బోనస్ ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. డిసెంబర్ 9న రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని నమ్మబలికారని హరీశ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ రైతులను చిన్నచూపు చూస్తున్నదని అన్నారు. మోటార్లు కాలిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని, పొలాలు ఎండిపోతున్నాయని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి కరెంట్ పోతలేదు అంటున్నారని, కొత్తపల్లిలో ఇప్పుడే కరెంటు పోయిందంటూ ధ్వజమెత్తారు. మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాల, రింగురోడ్డుకు నిధులు, రామయంపేటకు రెవెన్యూ డివిజన్ ఇచ్చామని గుర్తుచేశారు. వెంకట్రామారెడ్డి గుణంతో పాటు ధనం ఉన్న వ్యక్తి అని, రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి అందరికీ ఉపయోగకర పనులు చేస్తారని వెల్లడించారు. అనంతరం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో మెదక్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్‌రెడ్డి, ఏకే గంగాధర్‌రావు, జడ్పీటీసీ మాధవీరాజు, నార్సింగి జడ్పీటీసీ కిష్టారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పొట్లపల్లి ఆలయంలో బలగం డైరెక్టర్ పూజలు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 : బలగం సినిమా డైరెక్టర్ ఎల్దండి వేణు శుక్రవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. తీర్థప్రసాదాలను అందజేసి సన్మానించారు.



వేణుకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ కమిటీ





తొగుట మార్కెట్‌యార్డులోని కేంద్రంలో పేరుకుపోయిన పొద్దుతిరుగుడు గింజలు, రైతులతో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి

సన్‌ఫ్లవర్ రైతుల నిరీక్షణ

15 రోజులుగా పొద్దుతిరుగుడు గింజల కొనుగోళ్లు బంద్

- తొగుట మార్కెట్‌యార్డులో పేరుకుపోయిన 7,500 క్వింటాళ్లు
- పడరానిపాట్లు పడుతున్న రైతులు
- త్వరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలని ఆందోళన

తొగుట, ఏప్రిల్ 5: రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం మార్కెట్‌యార్డుల్లో పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు సాగడంలేదు. పొద్దుతిరుగుడు గింజలు విక్రయానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఫిబ్రవరి 28న మార్క్‌ఫెడ్ అధికారులు తొగుట మార్కెట్ యార్డులో కాన్గల్ (పీఏసీఎస్) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. క్వింటాల్‌కు రూ.6,760 మద్దతు ధర నిర్ణయించారు. పొద్దుతిరుగుడు గింజలను విక్రయించడానికి ఈ కొనుగోలు కేంద్రానికి దౌల్తాబాద్, రాయపోల్, మిరుదొడ్డి, తొగుట మండలాల నుంచి రైతులు తరలివచ్చారు. కాగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన 20 రోజుల్లోనే 222 మంది రైతుల నుంచి 2,764 క్వింటాళ్ల గింజలను కొనుగోలు చేసి ఇక్కడి నుంచి తరలించారు. కానీ, 15 రోజులుగా మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రానికి గన్నీ బ్యాగులు సరఫరా చేయకపోవడంతో సుమారు 250 మంది రైతులకు చెందిన 7,500 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు గింజలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. అసలే ఎండాకాలం కావడంతో మార్కెట్‌కు వచ్చిన రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. పొద్దుతిరుగుడు గింజలు తొందరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలని రైతులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అక్కడికి చేరుకుని రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిద్దామని వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు



ఇంతకు ముందు కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు గింజలను రాష్ట్రం నుంచి కేంద్ర ప్రభుత్వం సేకరించి నిలిపివేసింది. మిగతా పొద్దుతిరుగుడు గింజలను యథావిధిగా రాష్ట్రప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు కొనుగోళ్ల విషయమై ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

- కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి, కాన్గల్ పీఏసీఎస్ చైర్మన్

అరిగోస పడుతున్న పట్టించుకుంటలేరు



తొగుట మార్కెట్‌యార్డుకు 15 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు గింజలు తీసుకుని వచ్చి 13 రోజులైతుంది. ఇప్పటివరకు గన్నీబ్యాగ్‌లు ఇస్తలేరు. అడిగితే ఒక్కరూ పట్టించుకుంట లేరు. ఎండలో తెకాలు పడి.... అరిగోస పడుతున్నం. తొందరగా కొనుగోలు చేసి న్యాయం చేయాలి.

- బోదాసు నర్సవ్వ, అల్వాల, మిరుదొడ్డి మండలం

కొంటరా... కొనరా ?



గన్నీ బ్యాగ్‌లిస్తలేరు. అడిగితే సప్పుడు చేస్తలేరు. 15 రోజులుగా కుప్పల వద్ద ఎండలో చస్తున్నం. అసలు పొద్దుతిరుగుడు గింజలు కొంటరా... కొనరా? ఏదన్న ఒకటి చెబితే మాదారి మేము చూసుకుంటం. రోజు పొద్దున ఇక్కడికి రావడం రాత్రి ఇంటికి పోవడం ఇబ్బందైతుంది.

- బైకరి నర్సింహులు, వీరారెడ్డిపల్లి, అక్బర్‌పేట- భూంపల్లి మండలం

మెతుకుసీమలో కాంగ్రెస్‌లోకి వలసలు

- తుక్కుగూడ సభలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరికకు ముహూర్తం
- ఉగాది తర్వాత పెద్దఎత్తున చేరికలంటూ ప్రచారం

మెదక్, ఏప్రిల్ 5 : బీఆర్ఎస్ కంచుకోటగా పేరున్న మెతుకుసీమలో ఆ పార్టీకి బీటలు బారుతున్నాయి. నేతలు అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశం కావడం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. తన ప్రధాన అనుచరుల్లో ఒకరైన ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమయ్యారు. నేడు తుక్కుగూడలో తలపెట్టిన కాంగ్రెస్ సభలో వారంతా పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సభకు కాంగ్రెస్ ఆలిండియా ప్రెసిడెంట్ మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక హాజరై పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించనున్నారు. ఇదే సభలో పెద్దల సమక్షంలో పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే మాజీ సీఎం ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ చేజిక్కించుకుంది. బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం నెగ్గి, కాంగ్రెస్‌కు చెందిన మామిండ్ల జ్యోతికృష్ణ చైర్మన్ పదవిని అధిష్టించారు. ఈ మధ్యనే రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు దేమె యాదగిరి, దేవుని జయ, సుందర్ సింగ్, చిలుక గంగాధర్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ నివాసంలో సీనియర్ నాయకులు హన్మంత్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు.



అదే దోవలో మెదక్ బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నెల రోజులుగా మెదక్ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన పద్మారెడ్డి ఓటమి పాలు కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం తదితర పరిణామాలతో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం పార్టీ నుంచి వైదొలిగి కాంగ్రెస్‌లో చేరుతున్నది. బుధవారం మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు వసంత్‌రాజ్, కళ్యాణి, జయశ్రీ, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు మందుగుల గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్, దుర్గాప్రసాద్ మైనంపల్లి హన్మంత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉగాది పండుగ తర్వాత మరికొందరు పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, గతంలో కాంగ్రెస్ నుంచి జంప్ అయిన నాయకులు ఇప్పుడు మళ్లీ సొంత గూటికి చేరేందుకు తహతహలాడుతున్నారని ప్రచారం జరుగుతుంది. ఉగాది తరువాత బీఆర్ఎస్ నుంచి పెద్దఎత్తున చేరికలు ఉండబోతున్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

వాహనాల తనిఖీలో రూ.6 లక్షలు సీజ్



మనూరు, ఏప్రిల్ 5: పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా కారులో తరలిస్తున్న రూ.6 లక్షలను మనూరు ఎస్ఐ అమ్రానాయక్ శుక్రవారం సీజ్ చేశారు. మండల పరిధిలోని బాదల్‌గాం చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, జహీరాబాద్ నుంచి నాగల్‌గిద్ద మండలం మావినెల్లి గ్రామానికి వెళ్తున్న కారులో ఎలాంటి అనుమతి లేకుండా తీసుకెళ్తున్న రూ.6 లక్షలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కారులో తన్వీర్ మైనోద్దీన్ ఉన్నారని తెలిపారు.

కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద రూ.95 వేల నగదు

మనోహరాబాద్, ఏప్రిల్ 5: మండలంలోని కాళ్లకల్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.95 వేలు పట్టుబడ్డాయి. కొంపల్లి నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న బూర్గుల జయరామ్‌రెడ్డి ఎలాంటి పత్రాలు చూపించకుండా రూ.95 వేల నగదును తీసుకెళ్తుండడంతో సీజ్ చేశారు. ఈ డబ్బును సిద్దిపేట డీటీవో ఆఫీస్‌కు తరలించినట్లు ఎస్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.



రామంతాపూర్ ఊరచెరువు తూము

ఊరచెరువు నీటి చౌర్యంపై పోలీసులకు ఫిర్యాదు

మాసాయిపేట, ఏప్రిల్ 5 : మాసాయిపేట మండలం రామంతాపూర్‌లోని ఊరచెరువు తూము గేట్లను తెరిచి అక్రమంగా నీటిని తరలిస్తున్నారని గ్రామానికి చెందిన కొందరు గురువారం రాత్రి చేగుంట పోలీసులకు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. 15 రోజుల క్రితం ఇలాంటి సంఘటనతోనే అధికారులు తూములను మూసివేయగా తిరిగి మళ్లీ తెరవడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొన్నది. చేగుంట ఎస్ఐ బాలరాజు నేతృత్వంలో పోలీసులు గురువారం అర్ధరాత్రి రామంతాపూర్ గ్రామానికి చేరుకుని రైతులను సముదాయించారు. పంటలు ఎండిపోతున్న ప్రస్తుత తరుణంలో గ్రామస్థులు కలిసిమెలిసి ఉండాలని, శాంతియుతంగా ఉండాలని పోలీసులు రైతులకు సూచించారు. చెరువులో ఉన్న చేపలు మృతిచెందేలా నీటిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్
- విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

కొండపాక, ఏప్రిల్ 5 : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ పదో తరగతి కేంద్రంలో ఓ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గత నెల పదో తరగతి పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రంలో మార్చి 26న ఫిజిక్స్ పరీక్ష రాస్తున్న సమయంలో ఇన్విజిలేటర్‌గా వ్యవహరించిన చంద్రభాను అనే ఉపాధ్యాయుడు విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. అదే రోజు చీఫ్ సూపరింటెండెంట్‌కు విద్యార్థిని ఫిర్యాదు చేసింది. ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించగా విచారణకు ఆదేశించారు. నాలుగు రోజులు విచారించిన అనంతరం ఉపాధ్యాయుడు చంద్రభానును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చాడు. ఈ విషయంపై ఎంఈవో ను వివరణ కోరగా సస్పెన్షన్ ఉత్తర్వులు వాస్తవమేనని తెలిపారు.

నృసింహుడి దర్శనం పుణ్యఫలం

- రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి
- నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



వర్గల్, ఏప్రిల్ 5 : నాచగిరి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీనృసింహుడిని దర్శించుకుంటే జన్మజన్మల పుణ్యఫలం దక్కుతుందని రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీస్వామి అన్నారు. శుక్రవారం వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కొనసాగుతున్న నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే క్షేత్రంలో ఏర్పాటు చేసిన ధార్మిక, సంగీత, సాహిత్య హరికథా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవానంద సరస్వతీ భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవరుచుకోవాలన్నారు. దైవమార్గంలో నడిచినట్లయితే అన్ని శుభాలే కలుగుతాయన్నారు. లక్ష్మీ నృసింహుడిని నమ్ముకున్నవారికి అంత విజయమేనన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి హనుమంతోత్సవ సేవ నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి.


సంగారెడ్డిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


పటాన్‌చెరులో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 5: భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం నిర్వహించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సింహులు పాల్గొన్నారు. అదే విధంగా యూటీఎఫ్, కేవీపీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●**పటాన్‌చెరు:** బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

●**జహీరాబాద్:** జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో గల జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ మచ్ఛేందర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి, కోహీర్ జడ్పీటీసీ జి.రాందాస్ పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

●**వట్‌పల్లి:** మండల కేంద్రమైన వట్‌పల్లిలో వివిధ యువజన సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య పాల్గొన్నారు.

●**కోహీర్:** మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని చింతలఘట్టు, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు.

●**నారాయణఖేడ్:** బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌గుప్తా మాట్లాడారు. అలాగే పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

●**కల్హేర్/సిర్గాపూర్:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిర్గాపూర్ ఎంపీటీసీ వీరప్ప, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ సిగ్రె తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో

●**మెదక్:** ప్రతిఒక్కరూ జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ అన్నారు. శుక్రవారం మెదక్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

●**మెదక్ అర్బన్:** పేద, బడుగువర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ కొనియాడారు. శుక్రవారం సంఘ భవనంలో జగ్జీవన్‌రామ్ 117వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●**అల్లాదుర్గం:** అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతిని దళిత సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●**పెద్దశంకరంపేట:** మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. అంబేడ్కర్ సంఘం బాధ్యులు దుర్గయ్య, నాగరాజు, శివకుమార్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●**కొల్చారం:** కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేటలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాట్లాడారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద, కాళ్లకల్‌లో గ్రామ అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్, నాయకులు


నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీవో

అలాగే తూప్రాన్ పట్టణంలోని బస్టాండ్ వద్ద, యావాపూర్, మల్కాపూర్ గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

●**వెల్దుర్తి:** వెల్దుర్తి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఆఫీజా పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

●**నిజాంపేట:** నిజాంపేట మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. అనంతరం శ్రీ శ్రీనివాస్ నర్సింగ్ హోమ్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఉపసర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కొమ్మాట బాబు, మాజీ ఎంపీటీసీ తమ్మలి రమేష్, దళిత నాయకులు పాల్గొన్నారు.

●**చేగుంట:** చేగుంట మండల కేంద్రం మక్కరాజుపేట చౌరస్తాలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, చేగుంట ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు.

●**మాసాయిపేట:** మాసాయిపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దళిత నాయకులు, పలు రాజకీయ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు.

●**చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలోని ఎంపీడీవో దామోదర్ జగ్జీవన్‌రామ్ ఫొటోకు నివాళులర్పించారు.

●**హవేళిఘణపూర్:** మండల పరిధిలోని గ్రామాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకర్, ఎంపీటీసీ శ్రీకాంత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

●**రామాయంపేట:** రామాయంపేటలోని మెదక్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ ఫొటోను ఉంచి నివాళులర్పించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


భీమయ్య(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 5: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి మండలం మంగళపర్తి గ్రామానికి చెందిన మంగళి భీమయ్య(45) గురువారం రాత్రి తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి వెళ్తుండగా భీమయ్య చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారమందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పెంటమ్మ, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భీమయ్య మృతిపై అనుమానం ఉన్నదని, సమగ్ర విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భార్య పెంటమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నవత తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో యువకుడి మృతి


సాయిలు(ఫైల్)

కల్హేర్, ఏప్రిల్ 5: మండల పరిధిలోని ఇందిరానగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన కాటిపాపల సాయిలు(35), వడ్డెర సాయిలు(16), నారాయణఖేడ్ పట్టణానికి చెందిన విభూతి సాయిలు(16) ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి నారాయణఖేడ్ నుంచి కల్హేర్‌కు వెళ్తున్నారు. ఇందిరానగర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొనడంతో కాటిపాపల సాయిలు, వడ్డెర సాయిలు అక్కడికక్కడే మరణించిన విషయం విదితమే. తీవ్రంగా గాయపడిన విభూతి సాయిలును నారాయణఖేడ్‌కు.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

16 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

రామాయంపేట, ఏప్రిల్ 5: అక్రమంగా తరలిస్తున్న 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామాయంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో లారీలో లోడ్ చేసుకుని వెళ్తున్నది. దీంతో ఎస్‌ఐ రంజిత్ విచారణ చేపట్టి లారీని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే పోటీలో జూకల్ విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ప్రతిభ కనబర్చిన జూకల్ విద్యార్థులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 5: జిల్లా కేంద్రమైన మెదక్‌లో రెన్షాకి షోటోకాన్ కరాటే బెల్టు టెస్టు పోటీల్లో పెద్దశంకరంపేట మండల పరిధిలోని జూకల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి గ్రీన్, ఆరెంజ్, బ్రౌన్ బెల్టులను సాధించారు. గ్రామానికి చెందిన మధుప్రియ, సంతోష్ గ్రీన్, చరణ్ ఆరెంజ్, మల్లేశం బ్రౌన్ బెల్టులను సాధించారు. విద్యార్థులను కరాటే గ్రౌండ్ మాస్టర్ నగేష్, విద్యాసాగర్, దినాకర్, జూకల్ కరాటే మాస్టర్ పరశురాం అభినందించారు.

కొనసాగుతున్న దుర్గమ్మతల్లి ప్రతిష్ఠోత్సవాలు


దుర్గమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 5: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో దుర్గమ్మ తల్లి పునఃప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం రెండోరోజూ కొనసాగాయి. ఉదయం గణపతి పూజ, నవగ్రహ, ప్రధాన దేవత కలశస్థాపన, దేవిత పూజలు, ఆవాహిత దేవత, మూల మంత్ర హవనము తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణాసుభాష్‌గౌడ్, గుజ్జరి కనకరాజు, కందుకూరి రవీందర్ పాల్గొన్నారు.

ఖేడ్‌లో మున్సిపల్ చైర్మన్ పర్యటన


మురుగు కాల్వలో పూడుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న చైర్మన్

నారాయణఖేడ్, ఏప్రిల్ 5: ఖేడ్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ శుక్రవారం మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి పలువార్డుల్లో పర్యటించారు. మురుగు కాలువలు, నాలాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను, తాగునీటి ట్యాంకులు, వాల్వుల వద్ద నెలకొన్న అపరిశుభ్రతను పరిశీలించారు. వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు.

మత్తడి పోచమ్మ జాతరకు ఏర్పాట్లు


మత్తడి పోచమ్మ జాతర కోసం ఏర్పాట్లు చేయిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌గుప్తా

నారాయణఖేడ్, ఏప్రిల్ 5: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో ఉగాది సందర్భంగా నిర్వహించనున్న మత్తడి పోచమ్మ జాతరను పురస్కరించుకొని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేయించడం, జాతర నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలను మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్‌గుప్తా పర్యవేక్షించారు. మూడు రోజుల పాటు జాతర ఉంటుందని తెలిపారు.

న్యూ భోధి స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న న్యూ భోధి స్కూల్ విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 5: సంగారెడ్డి పట్టణం రామ్‌నగర్‌లోని న్యూబోధి స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు సర్టిఫికేట్స్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విశ్వమ్ ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ మార్కెటింగ్ మేనేజర్ నరేశ్, స్మార్ట్ కిడ్స్ బుక్స్ మార్కెటింగ్ మేనేజర్ సుధీర్ హాజరై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లింగయ్య, కరస్పాండెంట్ రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాచారం

శ్రీనివాస్‌కు డాక్టరేట్

జిన్నారం, ఏప్రిల్ 5: జిన్నారం గ్రామానికి చెందిన సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్‌కు సామాజిక సేవలకుగానూ డాక్టరేట్‌ను అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ మెడ్వార్ సిటీ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సామాజిక సేవలు అందజేసిన వారికి అవార్డులు అందజేశారు. ఇందులో శ్రీనివాస్ కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

వాహనదారులు లైసెన్సులు తీసుకోవాలి: ఎస్‌ఐ

సంగారెడ్డి రూరల్: వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు విధిగా తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటేశ్ అన్నారు. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్ గ్రామ పరిధిలోని ఎంఎన్‌ఆర్ చౌరస్తాలో శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా పత్రి రామకృష్ణ

నారాయణఖేడ్, ఏప్రిల్ 5: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన పత్రి రామక్రిష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయంలో 6న 17వ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు మోహన్‌జ్యోషి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల మద్దతు, కార్యకర్తల అండదండలే బలం

● నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి


నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో సునితారెడ్డిని సన్మానిస్తున్న పాలకవర్గం

నర్సాపూర్, ఏప్రిల్ 5: ప్రజల మద్దతు, కార్యకర్తల అండదండలే బలమని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన పుట్టినరోజును కార్యకర్తలు నిర్వహించగా.. ఆమె హాజరయ్యారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి తినిపించారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీటీసీ బబియానాయక్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, పార్టీ మండలాధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●**జిన్నారం:** ఎమ్మెల్యే సునితారెడ్డి జన్మదినం సందర్భంగా మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ బీరప్ప, జిన్నారం మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి ఆమె నివాసంలో కలిసి సన్మానించారు.

●**కొల్చారం:** ఎమ్మెల్యే సునితారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నర్సాపూర్‌లో జరిగాయి. ఈ వేడుకలకు బీఆర్‌ఎస్ కొల్చారం మండల నేతలు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గౌరీశంకర్, యువత అధ్యక్షుడు సంతోష్‌రావు పాల్గొన్నారు.

●**శివ్వంపేట:** ఎమ్మెల్యే సునితారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని ప్రముఖ చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో స్థానిక నాయకులు హోమం నిర్వహించారు. అలాగే శివ్వంపేటలో జడ్పీటీసీ మహేష్‌గుప్తా ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

●**వెల్దుర్తి:** వెల్దుర్తిలోని బస్టాండ్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ రమేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కందిలో నీటి కటకట

● మరమ్మతులో మిషన్ భగీరథ లైన్

● గ్రామస్థులకు ట్యాంకర్లే దిక్కు


కందిలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

కంది, ఏప్రిల్ 5: కంది మండలంలో మూడురోజులుగా మిషన్ భగీరథ లైన్ పగిలి మరమ్మతుకు గురైంది. దీంతో మండలవ్యాప్తంగా నీటి సరఫరా నిలిచిపోయింది. ఇంటి అవసరాలకు వాడుకుందామంటే నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కందిలోని పాత కంది, కొత్త కంది, లక్ష్మీనగర్‌కాలనీ, బంగ్లాబస్తీలలో గ్రామపంచాయతీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. 5 వేల లీటర్ల కెపాసిటీ ఉన్న ట్యాంకర్ ఒక్క వీధిలోని ఇళ్లకు సరిపోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. అధికారులు వెంటనే మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భగవంతుని సేవతోనే మనశ్శాంతి

● మాధవానంద సరస్వతీ స్వామి


సత్యనారాయణ వ్రతాలను పర్యవేక్షిస్తున్న మాధవానందస్వామి

కొల్చారం, ఏప్రిల్ 5: భగవంతుని సేవతోనే మనశ్శాంతి లభిస్తుందని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. మండల కేంద్రమైన కొల్చారంలోని శివాయం వార్షికోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 125 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బొజ్జ మురళీధర్, శ్రీధర్, అనిల్ దంపతులు వారి సొంత స్థలాన్ని శివాలయానికి దానం చేశారు. అలాగే ఆకుల సిద్ధిరాములు దంపతులు ఆవు, దూడను తొనిగండ్ల హనుమాన్ ఆలయానికి దానం చేశారు.

నేడు జహీరాబాద్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

●జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 5: నేడు జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో జహీరాబాద్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తామని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ టీఎస్‌ఐడీసీ చైర్మన్ మహ్మద్ తన్వార్, నారాయణఖేడ్, అందోల్, కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, గంప గోవర్దన్, హన్మంత్‌షిండే, జాజాల సురేందర్ హాజరవుతున్నారన్నారు.

వెంకట్రావుపేటలో నీటి సరఫరాకు చర్యలు


పగిలిన పైపులకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం, ఏప్రిల్ 5: 'భగీరథ' తాగునీటికి నోచుకోని వెంకట్రావుపేట!' అనే కథనం ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి శుక్రవారం చర్యలు చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాలతో సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులు పగిలిపోవడంతో మరమ్మతులు చేపట్టారు.

కిసాన్‌సాగర్ చెరువు తూము మరమ్మతులు


తూముకు మరమ్మతులు చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

కంది, ఏప్రిల్ 5: ఈ నెల 4న 'ఎండుతున్న పంటలు.. రైతుల విలవిల' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. శుక్రవారం భారీ కంప్రెషర్ మిషన్‌తో కందిలోని కిసాన్‌సాగర్ చెరువు తూముకు మరమ్మతులు చేశారు. దాదాపు 6 గంటలు శ్రమించి తూము పూడికను తీశారు. దీంతో కిసాన్‌సాగర్ చెరువు ఆయకట్టు పంట పొలాలకు యథాస్థితిలో నీళ్లు అందాయి. ఈ సందర్భంగా ఇరిగేషన్‌శాఖ ఏఈ మజారుద్దీన్ మాట్లాడుతూ చెరువులు, కుంటల తూములు పనిచేయకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

చెరువుల తూములకు షట్టర్లు బిగించండి

కల్హేర్, ఏప్రిల్ 5: సంగారెడ్డి జిల్లాలోని చెరువుల తూములు పరిశీలించి అవసరమైన చోట షట్టర్లు బిగించాలని, అందుకు అంచనాలను రూపొందించాలని సంగారెడ్డి జిల్లా నీటి పారుదలశాఖ ఎస్ఈ మురళీధర్ ఈఈ, డీఈలను ఆదేశించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని సుల్తానాబాద్ 'పెద్ద చెరువు షట్టర్ ఊడి ఏడాదైనా అధికారులకు పట్టదా' అనే శీర్షికన 2న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఎస్ఈ నారాయణఖేడ్ ఈఈ జైభీం, నల్లవాగు డీఈ పవన్‌కుమార్‌ను ఆదేశించారు. జిల్లాలో ఇలాంటి వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు.

కాంగ్రెస్ గెలుపునకు పాటుపడతా..

● ఇద్దరిమధ్య చిచ్చుపెట్టి వ్యక్తి ఇటీవల జైలు నుంచి విడుదల?

● కాంగ్రెస్ పటాన్‌చెరు ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్


కాంగ్రెస్ అభ్యర్థి మధుముదిరాజ్‌ను అభినందిస్తున్న కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 5: గతాన్ని మరిచి కలిసికట్టుగా మెదక్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్‌ను గెలిపించుకునేందుకు సమష్టిగా కృషిచేస్తామని కాంగ్రెస్ పటాన్‌చెరు ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తుక్కుగూడ జనజాతర భారీ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని శుక్రవారం రామచంద్రాపురం శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుడులా పోరాడాలన్నారు. నీలం మధును లక్షన్నర మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషిచేయాలన్నారు. గతంలో తమ మధ్య రాజకీయ చిచ్చుపెట్టిన వ్యక్తి ఇటీవల జైలు నుంచి విడుదల అయ్యారని, ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ కాంగ్రెస్ జెండాను ఎగరేయాలని సూచించారు. నీలం మధుముదిరాజ్ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో కాట శ్రీనివాస్‌గౌడ్ తాను రామలక్ష్మణుల్లా కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుక్కుగూడ జనజాతర సభకు పెద్దఎత్తున తరలివెళ్తాం

నర్సాపూర్, ఏప్రిల్ 5: ఈ నెల 6న తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనజాతర సభకు నర్సాపూర్ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి సభకు తరలించే ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి, ఎంపీపీ జ్యోతిసురేష్‌నాయర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.


ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి